క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని కే రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో చేరడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల హెచ్‌ఎం.ధనసరి నాగమణి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. పాఠశాలలో వివిధ తరగతుల్లో ఇంగ్లిష్ మీడియంలో ఖాళీలు ఉన్నాయని, విద్యార్థులు త్వరపడాలని సూచించారు. మండల ప్రధాన గ్రామంలో పాఠశాల ఉన్నందున విద్యార్థుల తల్లిదండ్రులు ఆశ్రమ పాఠశాల్లో విద్యార్థులను జాయిన్ చేయించడానికి ముందుకు రావాలని సూచించారు. 10వ తరగతిలో 16 సీట్లు, 9వ తరగతిలో 04, 8లో 03, 7లో10, 6వ తరగతిలో 95 సీట్లు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అడ్మీషన్ల కోసం పాఠశాలలో సంప్రదించాలని ఆయన సూచించారు.

క్యాంప్ కోర్ట్ నిర్వహించాలి

భద్రాచలంఅర్బన్: క్రిమినల్ న్యాయ పాలన వికేంద్రీకరణలో భాగంగా సత్వర విచారణ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు అదనపు జిల్లా సెషన్ కోర్టును ఏజెన్సీ కేంద్రమైన భద్రాచలంలో రెండు రోజులుపాటు క్యాంప్ కోర్టుగా నిర్వహించాలని భద్రాచలం బార్ అసోసియేషన్ కోరింది.

ఈ మేరకు మంగళవారం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లుకు స్థానిక బార్ అధ్యక్షుడు కోటా దేవదానం వినతిపత్రం అందజేశారు. విషయాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తికి దృష్టికి తీసుకెళ్లాలని వినతిలో పేర్కొన్నారు. కోర్ట్ ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న ఆర్‌అండ్‌బీ భవనాలను కూల్చివేసి కోర్టు భవనాలకు అడ్డంకి తొలగించాలని, కోర్టు పరిశుభ్రతకు శానిటేషన్ కార్మికులను నియమించాలని వినతిపత్రం ద్వారా కోరారు. బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

రామయ్య దర్శనానికి రండి

బూర్గంపాడు: భద్రాద్రి రామయ్య దర్శనానికి రావాలని పాడేరు ఐటీడీఏ పీఓ అభిషేక్‌ను భద్రాద్రి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు యడమకంటి రోశిరెడ్డి ఆహ్వానించారు. మంగళవారం పాడేరు ఐటీడీఏ పీఓ అభిషేక్‌ను మర్యాదపూర్వకంగా కలసి రామయ్య పట్టువస్త్రాలు, ప్రసాదాలను అందించారు. రామయ్య దర్శనానికి రమ్మని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ డీలర్ తేజావత్ కృష్ణ ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

దమ్మపేట: ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు బలంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ములకలపల్లి మండలం మూకమామిడికి చెందిన నడిపల్లి కిషోర్ ఈనెల 4న దమ్మపేట నుంచి పాల్వంచ వైపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో చిల్లగుంపు వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో కిషోర్‌కు గాయాలయ్యాయి. దీంతో ఆయనను సత్తుపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బంధువులు మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఇరువర్గాల ఫిర్యాదు

అశ్వారావుపేటరూరల్: దాడి ఘటనలో ఇరు వర్గాలు మంగళవారం రాత్రి పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఆసుపాక గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ తల్లాడ వెంకటేశ్వరరావుపై ఇదే గ్రామానికి చెందిన వంశి అనే యువకుడు మధ్య ఓ విషయంలో వాగ్వాదం జరగ్గా, తనపై దాడి చేసినట్లు ఉప సర్పంచ్ ఫిర్యాదు చేశారు. అదే విధంగా తనపై ఉప సర్పంచ్ దాడి చేసినట్లు వంశి ఫిర్యాదు చేయగా, పరస్పరం ఫిర్యాదులపై విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని రాజుపేట కాలనీకి కృష్ణ వేణి అనే యువతి సోమవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇంకా ఇంటికి తిరిగి రాకపోవడంతో తెలిసిన బంధువులను, స్నేహితులను ఆరా తీయగా కృష్ణవేణి ఆచూకి తెలియరాలేదు. దీంతో యువతి తల్లి ఫాతిమ మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేశారు.

చెరువుల పండుగ ఏర్పాట్లు పరిశీలన

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న ఊరురా చెరువుల పండుగ ఏర్పాట్లను మంగళవారం జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, ఇరిగేషన్‌శాఖ అధికారులతో కలసి పరిశీలించారు. మండల కేంద్రం బూర్గంపాడులోని కొల్లుచెరువులో నిర్వహించనున్న ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా జెడ్పీటీసీ శ్రీలత సూచించారు. ఈ ఉత్సవాల్లో చెరువు ఆయకట్టు రైతులందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సిరిపురపు స్వప్న, బీఆర్‌ఎస్ నాయకులు సాబీర్‌పాషా, జక్కం సుబ్రహ్మణ్యం, గొనెల నాని, భూపెల్లి నర్సింహారావు, బొల్లు రవి, రమేష్, తోకల సతీష్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పశువులకూ వడదెబ్బ ముప్పు!

- వసతులు లేమితో ప్రమాదం
- పాడి రైతులకు వాటిల్లనున్న నష్టం
- చిన్నపాటి జాగ్రత్తలతో రక్షణ

భద్రాచలంఅర్బన్: ఎండలు మండుతున్న నేపథ్యంలో మనుషులతోపాటు పశువులకూ వడదెబ్బ ముప్పు ఉంది. అదే జరిగితే అవి మృత్యువాతపడే అవకాశం ఉంది. ఇలాంటప్పుడు పాడి రైతులు అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. పశువుల కదలిక మేరకు వాటి ఆరోగ్యం అంచనా వేయాల్సి ఉంటుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా నష్టపోవాల్సి ఉంటుందని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో ఆవులు 2 లక్షలు, గేదెలు 1.25 లక్షలు, గొర్రెలు 1.55 లక్షలు, మేకలు 2 లక్షలు కలిపి మొత్తం 7.5 లక్షలు వరకు పాడి జంతువులు ఉన్నట్లు అధికారుల అంచనా. వేసవిలో పశువుల శరీర ఉష్ణోగ్రత కంటే బయటి ఉష్ణోగ్రత అధికమైనప్పుడు మెదడులోని హైపోదాలమస్ స్వేద గ్రంథుల నిర్వాహణపై పర్యవేక్షణ కోల్పోతాయి. చమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడి వేగం పెరుగుతాయి. మూత్ర పిండాలు సరిగా పని చేయకపోవడంతో మూత్ర విసర్జన కుంటుపడుతుంది. దీంతో పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి శ్వాస ఆడక మరణించే ప్రమాదం ఉంది. వడదెబ్బ తగిలిన పశువులు శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. నోటి వెంట సొంగ కారుతుంది. నీడ కోసం చెట్టుకిందకు చేరి కూలబడుతాయి. శ్వాస పీల్చడం కష్టమవుతుంది.. వడదెబ్బ ప్రభావంతో చూడి పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుంది. వడదెబ్బతో దూడల్లోవ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దూడలకు అతిసార వ్యాధి వ్యాపించే ప్రమాదం లేకపోలేదు.

ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు పశువులను బయటకు వదల కూడదు. ఉదయం సాయంత్రం మాత్రమే పశువులను బయట వదలాలి. రోజుకు మూడు, నాలుగు మార్లు చల్లటి నీటితో కడగాలి. నాటు జాతి పశువుల కంటే సంకర జాతి ఆవులు, గేదెలు త్వరగా వడదెబ్బకు గురవుతాయి. వాటిపై తరచుగా చల్లని నీటిని చల్లుతూ ఉండాలి. గాలి బాగా తగిలేలా ఎత్తున పశువుల కొట్టాన్ని గడ్డితో నిర్మించాలి. రేకుల కప్పులు ఉన్న పశువుల షెడ్లపై గడ్డిని కప్పి మధ్యాహ్న సమయంలో నీరు చల్లుతూ ఉండాలి. వడగాల్పుల ప్రభావం పడకుండా గోనె సంచి పరదాలను ఏర్పాటు చేసుకుంటే చాలా రక్షణ.


గేదెలకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది (ఫైల్)

పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలి



వేసవిలో పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలి. పశువుల కదలిక మేరకు ఆరోగ్యాన్ని అంచనా వేయాల్సి ఉంటుంది. వడదెబ్బకు గురైందని అనుమానం వస్తే వెంటనే పశువును చల్లని గాలి వీచే ప్రదేశానికి మార్చాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుకోడానికి చల్లని నీటితో కడగాలి. పశువైద్యాధికారులను సంప్రదించాలి. వేడిని తగ్గించే ఇంజెక్షన్ వేయించాలి. రక్తంలో అవసరమైన సైలైన్ ఎక్కించితే పశువులు నీరసం నుంచి బయటపడతాయి.

– పురంధర్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

నీళ్లు, నీడ కల్పించాలి



పెంపుడు జంతువులు, పక్షుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వాటికి తరచూ దాహార్తి తీర్చడంతో పాటు నీడ వసతి కల్పించాలి. రైతుల పరిధిలో తొట్లు ఏర్పాటు చేసి వాటిలో ఎప్పుడూ నీటిని నిల్వ ఉంచాలి. ఇళ్లు, కార్యాలయాల వద్ద నీళ్లు, నీడ సౌకర్యం ఉండాలి. వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు, పక్షుల సంరక్షణ కోసం తగిన చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్, ఇన్‌చార్జ్ ఏడీఏ, భద్రాచలం

కొనసాగుతున్న బడిబాట


బూర్గంపాడు: బడిబాట కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు


చంద్రుగొండ: సామ్యతండాలో పిల్లలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బూర్గంపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని బూర్గంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాన్సన్ కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం బూర్గంపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్యను, దుస్తులు, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను అందిస్తున్నారన్నారు. అదేవిధంగా ఉచిత కంప్యూటర్ విద్య, డిజిటల్ విద్యాబోధన కొనసాగుతుందన్నారు. మన ఊరు–మన బడితో పాఠశాలలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయన్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులతో పాటుగా అల్పాహారం కూడా అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలంలో ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా వెంకటియాతండా పంచాయతీ సామ్యతండాలో ఉపాధ్యాయులు పిల్లలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ గుగులోతు బాలాజీ మాట్లాడుతూ అన్ని సదుపాయాలు, నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలను చేర్పించాలని తండావాసులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇస్లావత్ వీరన్ననాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

దుమ్ముగూడెం: కేసీఆర్ నాయకత్వంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం నుంచి ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచర్ల రంగారెడ్డి విమర్శించారు. మంగళవారం మండలంలోని రామచంద్రుని పేట గ్రామంలో ప్రజాపంథా ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ ప్రజల ఆకాంక్ష దివాసి కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12 లక్షల ఎకరాలకు దరఖాస్తులు చేసుకుంటే 4.30 లక్షలకే పట్టాలిస్తామంటే మిగతా ఎనిమిది లక్షల ఎకరాల పోడు భూమిని ఏమి చేద్దామని ఈ ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుందని అన్నారు.

జూన్ 12వరకు ఆకాంక్షలు, కోర్కెలు, సమస్యలపై వివిధ కార్యక్రమాలు చేపట్టాలని 12వ తేదీన జిల్లా కేంద్రంలో ప్రదర్శనలు, దీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా భద్రాచలం డివిజన్ కార్యదర్శి కెచ్చెల కల్పన, మండల కార్యదర్శి సాయన్న, రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు సున్న వీరభద్రం, నాయకులు కల్లూరు శంకరు, నారాయణ, శాంతమ్మ, రామ్ చిట్టి, అర్జున, తదితరులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రజాపంథా పార్టీ నాయకులు

కాంగ్రెస్ విస్తృత ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మణుగూరురూరల్: భారత్ జోడో యాత్రకు సంఘీభావంగా మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నాయకులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పది రోజులుగా నిర్వహిస్తున్న గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం మంగళవారం విప్పలసింగారం గ్రామంలో కొనసాగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్రంలో బిజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాల నిరంకుశ పాలనను అంతమొందించేందుకు ప్రజలంతా కాంగ్రెస్‌ను ఆదరించి రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు వరంగల్, నిరుద్యోగులకు హైదరాబాద్ డిక్లరేషన్‌లను అమలు చేయడంతో పాటు రూ.500లకే గ్యాస్ వంటి పథకాలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు కొత్తపల్లి సత్యానారాయణ, పాల్వంచ రాములు, పాల్వంచ శ్రీను, షేక్ లతీఫ్, పార్వతి, నవీన్, లాలు, నాగరాజు, పవన్ పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని ఆ పార్టీ టీపీసీసీ మెంబర్, ములకలపల్లి జెడ్పీటీసీ సున్నం నాగమణి అన్నారు. మండలంలోని తొట్టిపంపు, ఒడ్డుగూడెం గ్రామాలలో మంగళవారం ఉపాధి కూలీల వద్దకు వెళ్లి హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ గురించి వివరించారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టింది కాంగ్రెస్ పార్టీయే అని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఉపాధి కూలీలకు వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వనమా గాంధీ, ఇనపనూరి జమలయ్య, తానం నాగేంద్రబాబు, సున్నం పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా జక్కిరెడ్డి



భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా జక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని రాఘవ నిలయం (రెడ్డి సత్రం)లో మంగళవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కార్యదర్శిగా శ్రీహరి, కోశాధికారిగా వాసు, గౌరవ అధ్యక్షుడిగా కుప్పాల నాగరాజు, గౌరవ సలహాదారుడిగా శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా ఈశ్వర్‌తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రమేష్, శ్రీనివాస్, సంతోష్, కిరణ్, లక్ష్మణ్, శివ, విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా రఘు

దుమ్ముగూడెం: మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన ధనగం రఘు జిల్లా ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ఎంపిక కాగా.. మంగళవారం ప్రభుత్వ విప్ పినపాక ఎమ్మెల్యే రేగాకాంతారావు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆయనను శాలువతో సత్కరించి, అవార్డును అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జిల్లాలోని నవభారత్‌లో జరుగుతున్న కార్యక్రమంలో దళితబంధు ద్వారా లబ్ధి పొంది అభివృద్ధి చెందుతున్న ధనగం రఘును ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ఎంపిక చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ ఆటో యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. పట్టణంలో మంగళవారం జరిగిన 9 అడ్డాల అధ్యక్షుల ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడిగా శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ఆటో అడ్డాల అధ్యక్షులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌కు రాజీనామా

మణుగూరురూరల్: టీబీజీకేఎస్ లెవెన్ మెన్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్న సామా శ్రీనివాస్‌రెడ్డి పదవికి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని మంగళవారం ఆయన వెల్లడించారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన తాను యూనియన్ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు. ఇంతకాలం తనకు సహకరించిన యూనియన్ నాయకులు, కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాసమస్యలను పట్టించుకోరా?

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల పేరిట అధికారులు ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని కూడా రద్దు చేసి అధికారులు ఉత్సవాలలో మునిగితేలుతున్నారని విమర్శించారు. అధికారులు తమ కార్యాలయాలలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

సీఎం కేసీఆర్‌తోనే సమగ్రాభివృద్ధి


మణుగూరురూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మణుగూరు కిన్నెర కల్యాణ మండపంలో ఆయన సమితిసింగారం బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. అందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు బీఆర్‌ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గడప గడపకూ చేరవేయాలన్నారు. అభివృద్ధిని చూసి ఇతర పార్టీలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, వాటికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు రామిరెడ్డి, కత్తి రాము, వట్టం రాంబాబు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

‘మిషన్ కాకతీయ’తో అద్భుతాలు సృష్టించాం

కరకగూడెం: మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులను పునరుద్ధరించి అద్భుతాలు సృష్టించి రైతన్నకు సాగు సహాయం చేశామని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం సమత్ భట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తన స్వగ్రామమైన కుర్నవల్లి గ్రామంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8వ తేదీన ఊరూరా చెరువుల పండగకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 8వ తేదీ నాడు జరిగే ఊరురా చెరువుల పండుగను గ్రామపంచాయతీలు నీటి పారుల శాఖ ఆధ్వర్యంలో విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. 22వ తేదీ వరకు జరిగే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగ్యస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజ్‌కుమార్

కరకగూడెం: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. కరకగూడెం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీని మంగళవారం ఆయన సందర్శించి కీటక జనిత వ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల జాగ్రత్తలు గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామానికి చెందిన శివకీర్తన(17)అనే బాలిక మృతి చెందగా.. ఆమె మృతికి దారి తీసిన అనారోగ్య పరిస్థితులపై విచారణ చేశారు. మండలంలో జ్వర పిడితుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నేటి నుంచి జిల్లా స్థాయి అదనపు వైద్య బృందాలను మండలానికి పంపించి వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి కారం మధు, డిప్యూటీ ఆఫీస్ సూపర్‌వైజర్ వీసాల కృష్ణ, ఎస్‌యూఓ లింగ నాయక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ పాస్ పుస్తకాలు ఇవ్వాలి

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక రెవెన్యూలో ముత్తాతలు, తాతల కాలంగా సాగులో ఉన్న భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు.

నెల్లిపాక రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పాస్ పుస్తకాలు ఇచ్చి భూములకు హక్కు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

చంద్రుగొండ: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు గానుగపాడు సహకార పరపతిసంఘం చైర్మన్ చెవుల చందర్‌రావు కోరారు. గానుగపాడులోని సొసైటీ కార్యాలయంలో మంగళవారం పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ లంక నర్సింహారావు, రైతుబంధు మండల సమన్వయకర్త గాదే లింగయ్య పాల్గొన్నారు.

జెడ్పీటీసీకి సన్మానం


జెడ్పీటీసీ శ్రీలతను సన్మానిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నవభారత్‌లో నిర్వహించిన పారిశ్రామిక ప్రగతి ఉత్సవాల్లో బూర్గంపాడు జెడ్పీటీసీ సభ్యురాలు, పారిశ్రామికవేత్త కామిరెడ్డి శ్రీలతను ఘనంగా సన్మానించారు. లక్ష్మీపురంలో మహాలక్ష్మి ఇండస్ట్రీస్, మైథిలి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిర్వహకురాలిగా కామిరెడ్డి శ్రీలత సాధిస్తున్న పారిశ్రామిక పురోగతిని గుర్తిస్తు తెలంగాణ ప్రభుత్వం ఆమెను సన్మానించింది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న టీఎస్ ఐపాస్‌తో పారిశ్రామిక ప్రగతి జిల్లాలో ఊపందుకుందని ఈ సందర్భంగా శ్రీలత అన్నారు. ఐటీసీ అనుబంధ పరిశ్రమలతో జిల్లాలో పారిశ్రామిక ప్రగతి వేగవంతమైందన్నారు. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియలు కామిరెడ్డి శ్రీలతను ఘనంగా సన్మానించారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


దుమ్ముగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ముత్యాలరావు

దుమ్ముగూడెం: మండల పరిషత్ సమావేశ కార్యాలయంలో ఎంపీపీ రేసు లక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగా సాగింది. సమావేశంలో వివిధ శాఖల అధికారులు ఈ 3 నెలల కాలానికి చెందిన పురోగతి వివరాలను సభకు తెలియచేశారు. ఎంపీటీసీ యలమంచి వంశీ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులకు ఒక వారం పది రోజులు రోజులు విరామం ఇవ్వాలని మిర్చి కోతలు చివరి దశకు వచ్చిన నేపథ్యంలో కూలీలు అందుబాటులో లేక మిర్చి నేల రాలిపోతుందని అన్నారు. లైగింక వేధింపుల ఆరోపణలతో సస్పెండ్ అయిన నర్సాపురం ఉపాధ్యాయుడిని మళ్లీ ఇదే మండలంలోని పర్ణశాల జిల్లా పరిషత్ పాఠశాలలో తిరిగి విధులు కేటాయించడంపై నిరసన తెలిపారు. తక్షణమే ఉపాధ్యాయుడిని వేరే మండలానికి బదిలీ చేయాలని సభలో ఏకగ్రీవ తీర్మానం చేయగా సభ ఆమోదించింది. ఎంపీటీసీలు కోర్సా చిలకమ్మ, మడకం రామారావులు తాలిపేరు కాలువ పూడికతీత, చెరువుల పూడికతీతపై తాలిపేరు అధికారులను ప్రశ్నించారు. గౌరారం సర్పంచ్ జ్యోతి త్రిఫేజ్ విద్యుత్ సరఫరాపై, ఇతర ప్రజాప్రతినిదులు మిషన్ భగీరథపై సమస్యలను సభ ముందు ఉంచారు. ప్రజాప్రతినధులందరూ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనాలని ఎంపీడీఓ ముత్యాలరావు ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మణిధర్, ఏఓ నవీన్‌కుమార్, యంఈఓ సున్నం సమ్మయ్య, మిషన్ భగీరథ ఇంటిగ్రేటెడ్ డీఈ యేసుబాబు, ఏఈ రాము,వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగా జరుగగా, పలుశాఖల అధికారులు సభకు హాజరుకాకపోవడంపట్ల ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని, గైర్హాజరైన అధికారులకు మోమో జారీ చేస్తామని ఎంపీడీఓ శ్రీను తెలుపడంతో శాంతించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. వైస్‌ఎంపీపీ కొదుమూరి పుల్లారావు అధ్యక్షత వహించగా.. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సభకు మూడు రోజుల ముందుగా ఎజెండా, ప్రగతినివేదిక ఇవ్వాల్సి ఉండగా అవేమీ తమకు తెలుపలేదని ఎంపీటీసీలు తులసి, సునిత, మెహరమణి, విజయలు అసహనం వ్యక్తం చేశారు. 27 శాఖలకుగాను, 16 శాఖల అధికారుల మాత్రమే సభకు హాజరయ్యారని, కేవలం ఏడుగురు అధికారులే నివేదికలు సమర్పించడంలో ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. పదో తరగతి ఫలితాల్లో మండలంలో 56 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించడంపై వైస్‌ఎంపీపీ పుల్లారావు, ఎంపీటీసీలు మెహరమణి, తులసి, సునిత ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు ఉత్సవాల్లో ఉత్తమరైతుల విభాగంలో పాడిరైతులను ఎందుకు ఎంపిక చేయలేదని కో–ఆప్షన్ సభ్యుడు జబ్బార్ ప్రశ్నించారు. జెడ్పీటీసీ సున్నం నాగమణి పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.